E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 04-05-2025 (వారం) ఆదివారం

హైదరాబాద్ పేజీలు–6

e-kaburu.com



మాటల వరకే 'మార్పు'.. అనుసరించేది పాత పద్ధతులే

» 2లో

# జాతీయ స్థాయిలో కులగణన

## రోజంతా ఢిల్లీలోనే సీఎం రేవంత్‌రెడ్డి



**జాతీయ స్థాయిలో కులగణన, పహల్గాం ఘటనలపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి శుక్రవారం ఢిల్లీకి చేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజంతా హస్తినలోనే గడిపారు.**

**కొందరు కాంగ్రెస్ నేతలతో లంచ్**

**చివరి నిమిషంలో రద్దయిన కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్లు!**

న్యూఢిల్లీ, మే 3: జాతీయ స్థాయిలో కులగణన, పహల్గాం ఘటనలపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి శుక్రవారం ఢిల్లీకి చేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో రోజంతా హస్తినలోనే గడిపారు. శుక్రవారం రాత్రికే హైదరాబాద్ చేరుకుంటారని సీఎం సన్నిహిత వర్గాలు చెప్పినప్పటికీ, ఆయన మాత్రం ఢిల్లీలోనే ఉన్నారు. శనివారం తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవితో సుమారు గంటకుపైగా సీఎం మాట్లాడారు. ఆ తర్వాత సుమారు 2.30 సమయంలో ఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మధ్యాహ్నం భోజనం చేశారు.

తరువాయి 2లో

## ఆ విషయంలో రైతుల ఉసురు పోసుకుంటున్నారు.. కాంగ్రెస్ పై హరీష్ రావు ఫైర్



**ఈ కబురు: రైతు కుటుంబాలకు ధీమానిచ్చే రైతు బీమాను అటకెక్కిస్తున్నారని, ఇది ఖచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. రైతు బీమా పథకం పై ట్విట్టర్ వేదికగా స్పందించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హరీష్ రావు.. ఏ కారణంతో అయినా, రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.**

అలాగే ఫిబ్రవరి నెలలోనే చెల్లించాల్సిన రూ. 775 కోట్ల ప్రీమియం మూడు నెలలుగా ప్రభుత్వం చెల్లించకపోవడం శోచనీయమని, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, రైతు కుటుంబాలకు శాపంగా మారుతున్నదని అన్నారు. అసలు రాష్ట్రంలో రైతు బీమా పథకం కొనసాగుతున్నదా? లేదా అటకెక్కించారా అనే అనుమానం కలుగుతుందన్నారు. వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టారు అని, యాసంగి పైసలు ఎప్పుడు ఇస్తారు.. అని మేము అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మార్చి 31 లోగా మొత్తం చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని, మొత్తంగా రైతు బంధు పథకాన్ని ప్రశ్నార్థకం చేసారని దుయ్యబట్టారు. రుణమాఫీ హామీ విషయంలో మేము వెంటబడితే దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పారని, సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా రైతుల ఉసురుపోసుకున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

తరువాయి 2లో

# రెండేళ్లలో దేవాదులను పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్





ఈ కబురు: దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును పూర్తి చేయడమే మా ప్రథమ ప్రాధాన్య లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు, జిల్లా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహా ఇతర ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్సీలు శనివారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ ను సందర్శించారు. నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉన్నారు. పంప్ హౌస్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రులు అనంతరం దేవాదుల పంపు హౌజ్ లో వివిధ అంశాలపై సాగునీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి నేరుగా దేవన్నపేటలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద మంత్రులు దిగగా ఎమ్మెల్యేలు, కలెక్టర్, తదితరులు పుష్పగుచ్ఛాలను అందజేశారు.

» 2లో

## పాక్‌కు మరో షాక్.. ఆ దేశం నుంచి దిగుమతులపై నిషేధం



**పాకిస్థాన్ నుంచి చేసుకునే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు భారత వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.**

ఈ కబురు,దిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న న్యూదిల్లీ తాజాగా మరో గట్టి షాకిచ్చింది. ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధించింది. ఈమేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది.

“పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి” అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

» 2లో

## కాంగ్రెస్ కుల సర్వేతో బీసీలకు అన్యాయం



**రేవంత్ సర్కారు చేసింది కులాల సర్వే మాత్రమే**

**బీఆర్ఎస్ నేతలు ఒకరు రిటైర్, మరొకరు లీవ్, ఇంకొకరు రెస్టులో..**

**5న రాష్ట్రంలో రూ.5 వేల కోట్ల రోడ్ల పనులకు శ్రీకారం**

**ప్రారంభించనున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి**

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయలేదని, కులాల సర్వే మాత్రమే చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ కులాల సర్వేతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి.. బీసీలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. శనివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చట్టం ఆధారంగా జనాభా లెక్కలతోపాటు పక్కాగా కులగణనను చేపట్టనుందని తెలిపారు.

» 2లో

## నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు: మంత్రి పొంగులేటి



**గృహ నిర్మాణ శాఖకు మంచి పేరు తేవాలని ఇంజినీర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.**

ఈకబురు, హైదరాబాద్: గృహ నిర్మాణ శాఖకు మంచి పేరు తేవాలని ఇంజినీర్లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఎక్కడ తప్పు జరగకుండా చూసే బాధ్యత ఇంజినీర్లదే అన్నారు. న్యాక్‌లో 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతి పొందిన వారికి మంత్రి ఆర్డర్ కాపీలు అందజేసి మాట్లాడారు.

» 2లో

## మానవాళి ఎదుట ఉన్న అతిపెద్ద ముప్పు ఉగ్రవాదం



ఈ కబురు: మానవాళి ఎదుట ఉన్న అతి పెద్ద ముప్పు ఉగ్రవాదం అని ప్రధాని మోడీ అన్నారు. దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ప్రధాని నరేంద్ర మోడీ భేటీ అయ్యారు. ఆ తర్వాత వీరిద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అప్పుడే మోడీ పహెల్గాం ఉగ్రదాడి గురించి ప్రస్తావించారు. “ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద ముప్పు. పహెల్గాం దాడి తర్వాత సీమాంతర ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా మద్దతుగా నిలిచింది. అందుకు ఆ దేశానికి ధన్యవాదాలు తెలుపుతున్నా. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి మేం కట్టుబడి ఉన్నాం” అని మోడీ నొక్కి చెప్పారు.

» 2లో

**ఉత్కంఠ పోరులో ఆర్సీబీ విజయం.. ప్లేఆఫ్స్ బెర్తు ఖాయం**

» 6లో



**అమెరికాకు రూటు మారుతోంది**

» 4లో



**వివాదంపై క్లారిటీ ఇచ్చిన విజయ్ దేవరకొండ..**

» 5లో



**పసిడి బాండ్ల మదుపర్లకు గోల్డెన్ ఛాన్స్.. ₹1లక్ష పెట్టిన వారికి ₹3 లక్షలు!**

» 4లో



**ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : డిప్యూటీ సీఎం**



» 2లో

మొదటి పేజీ తరువాయి

# జాతీయ స్థాయిలో కులగణన రోజంతా ఢిల్లీలోనే సీఎం రేవంత్‌రెడ్డి

సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఓ ఎంపీ, ఎప్పుడూ సీఎం వెంటే ఉండే మరో కాంగ్రెస్ నేత.. మరి కొందరు కూడా సీఎంతో ఈ లంచ్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసానికి చేరుకున్నారు. అనంతరం రాత్రి ఢిల్లీ నుంచి సీఎం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, తెలంగాణకు రావాల్సిన నిధులు, అభివృద్ధి పనులకు సంబంధించి కొందరు కేంద్రమంత్రులను కలిసేందుకు సీఎం ప్రయత్నించారని, కానీ చివరిని మిషంలో వారి అపాయింట్‌మెంట్లు రద్దయ్యాయని సమాచారం. అందుకే శనివారం రాత్రి వరకు సీఎం ఢిల్లీలోనే ఉన్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ ఒకరు ధ్రువీకరించారు.

# ఆ విషయంలో రైతుల ఉసురు పోసుకుంటున్నారు.. కాంగ్రెస్ పై హరీష్ రావు ఫైర్

ఇప్పుడు రైతు కుటుంబాలకు ధీమా ఇచ్చే రైతు బీమా పథకాన్ని లేకుండా చేస్తున్నారని, ఇంతకంటే అమానుషం ఏమైనా ఉంటదా? ఇది కచ్చితంగా రైతు వ్యతిరేక ప్రభుత్వమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలేసి గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి, మంత్రులకు రైతు కుటుంబాల కన్నీళ్లు కనిపించడం లేదా? అని నిలదీశారు. వివిధ కారణాలతో గడిచిన మూడు నెలల్లో సుమారు వందకు పైగా రైతులు చనిపోయినట్లు తెలుస్తోందని, ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో ఆయా కుటుంబాలకు రైతు బీమా సాయం అందకుండా పోయిందని తెలిపారు. ఒకవైపు కుటుంబ పెద్దను కోల్పోయి, మరోవైపు రైతు బీమా అందక ఆ కుటుంబాలు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నాయని చెప్పారు. ఇక రైతు కుటుంబాలకు ప్రభుత్వమే రూ. 5 లక్షలు చెల్లించి, కి పెండింగ్ లో ఉన్న ప్రీమియం తక్షణం కట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన హరీష్‌రావు డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

# పాక్‌కు మరో షాక్.. ఆ దేశం నుంచి దిగుమతులపై నిషేధం

దిగుమతుల విలువ తక్కువే..
భారత్‌పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీవాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

గణాంకాల పరంగా చూస్తే కూడా.. ఈ దిగుమతుల విలువ చాలా తక్కువే. 202425 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడినుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది కేవలం 0.1శాతం మాత్రమే.

పాక్‌లో ఆ రంగాలపై ప్రభావం..
విలువ పరంగా ఈ వాణిజ్యం స్వల్పమే అయినప్పటికీ.. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతో పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది.

పాక్ ఓడలు రావొద్దు..
మరోవైపు, పాకిస్తాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

# కాంగ్రెస్ కుల సర్వేతో బీసీలకు అన్యాయం

కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. 'బీఆర్ఎస్ నేతల్లో ఒకరు రిటైర్మెంట్‌లో ఉన్నారు. ఒకరు లీవ్‌లో ఉన్నారు. ఒకరు నడుము విరగ్గొట్టుకొని రెస్ట్‌లో ఉన్నారు (కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఉద్దేశించి)'అని ఎద్దేవా చేశారు.

5న రూ.5 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు
ఈ నెల 5న ఆదిలాబాద్, హైదరాబాద్‌లో రూ.5,416 కోట్లతో చేపట్టిన 26 ప్రాజెక్టుల పనులకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. తెలంగాణతో ముడిపడి ఉన్న 5 కారిడార్ల నిర్మాణానికి కేంద్రం లక్ష కోట్లు ఖర్చు చేస్తోందని చెప్పారు.

2014 వరకు తెలంగాణలో 2,500 కి.మీ జాతీయ రహదారులుంటే, ప్రస్తుతం 5,200 కి.మీలకు పెంచామని వెల్లడించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత త్వరగా భూములను అప్పగిస్తే.. అంత వేగంగా రోడ్ల నిర్మాణం పూర్తిచేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లా కేంద్రాల గుండా జాతీయ రహదారులు వెళ్తున్నాయని చెప్పారు.

# మాటల వరకే 'మార్పు'.. అనుసరించేది పాత పద్ధతులే

ఈ కబురు: డిగ్రీ ప్రవేశాలు, కోర్సుల్లో గుణాత్మక మార్పుల దిశగా అడుగులేయాలనుకుంటున్న ఉన్నత విద్యా మండలి నిర్ణయాలు ఏ మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. నిన్న, మొన్నటి వరకు డిగ్రీలో బకెట్ విధానాన్ని ఎత్తివేస్తామని ప్రకటించిన ఉన్నత విద్యా మండలి.. మళ్లీ పాత పద్ధతినే అనుసరిస్తున్నది. ఈ ఏడాది దోస్త్ నోటిఫికేషన్‌లో బకెట్ సిస్టమ్ ఎత్తివేయడం లేదంటూ తేల్చిచెప్పింది. ఒక విద్యార్థి ఒక కాలేజీలో చేరినప్పటికీ ఆ కాలేజీలో లేని, వేరే కాలేజీలో ఉన్న సబ్జెక్టును చదివేందుకు వీలుగా 2023లో బకెట్ విధానం తీసుకొచ్చారు. ఇప్పటికే 'బకెట్ సిస్టమ్'లో చేరిన విద్యార్థులు ఆ కోర్సు పూర్తయ్యే వరకు కొనసాగుతారు.

అలాగే సిలబస్ లో 20 శాతం మార్చబోతున్నట్లు ప్రకటించినా.. అది కూడా ఆచరణలో ఎలా ఉంటుందో ప్రశ్నార్థకమనే వాదనలు వినిపిస్తున్నాయి. గత నెలలో బకెట్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ఉన్నత విద్యామండలి, తాజాగా డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ప్రవేశ ప్రక్రియలో మళ్లీ బకెట్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. విద్యామండలి లో సొంత నిర్ణయాలకు ఎక్కువ ఆస్కారం ఉండడం, అధికారుల మధ్య సమన్వయ లోపాలు వెరసి విద్యార్థుల భవిష్యత్ కు ఉపయోగపడాల్సిన కార్యాచరణ అమలుకు నోచుకోవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మౌలిక వసతుల లేమి
దోస్త్ విధానం ద్వారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు పెరిగినప్పటికీ, కొన్ని డిగ్రీ కాలేజీల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు మధ్యలోనే కాలేజ్ మానేయాల్సి వస్తున్నదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ బడుల్లోని కొన్ని గదుల్లో డిగ్రీ కాలేజీలు నిర్వహిస్తుండడం కూడా గ్రౌండ్ లెవల్‌లో పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. దోస్త్ ప్రక్రియలో బకెట్ సిస్టం వల్ల నచ్చిన కాలేజీలను ఎంచుకునే అవకాశాలు కూడా కోల్పోతున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.

'బకెట్'పై భిన్నాభిప్రాయాలు

బకెట్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత కొన్ని కోర్సులకు విద్యార్థుల ఆదరణ తగ్గిందని పలువురు లెక్చరర్లు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి ప్రాథమిక శాస్త్ర కోర్సుల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమకు నచ్చిన లేదా ఎక్కువ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకునే స్వేచ్ఛ పొందడంతో ఈ కోర్సులకు ఆదరణ తగ్గి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది ఆయా విభాగాల యొక్క భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో చాలా మంది విద్యార్థులు వాటిని ఎంచుకోవడానికి మొగ్గు చూపారు. దీనివల్ల ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ఇది ఆయా విభాగాల్లో పరిశోధన, అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి

# రెండేళ్లలో దేవాదులను పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి





దేవాదుల పంపు హౌజ్ స్టేషన్ చేరుకున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి టన్నెల్‌ను పరిశీలించారు. అనంతరం దేవాదుల పంపు హౌజ్ పనుల పురోగతి, ఇతర అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు అన్ని దశలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే దేవాదుల పంప్ హౌస్ ను సందర్శించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన సాగునీరు, ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదుల మూడు పైప్ లైన్ల పంపులను ఆన్ చేసి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేవాదుల పంప్ హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న దేవాదుల పైపులను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఎన్సీ అనిల్ కుమార్, సీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రెండేళ్ల వ్యవధిలో దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఆలేరు,భోనగిరి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.
పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులన్నీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నామని ఆయన వెల్లడించారు. శనివారం రోజున సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,శాసన సభ్యులు కడియం శ్రీహరి,యశస్విని రెడ్డి,నాయిని రాజేందర్ రెడ్డిలతో కలిసి ఆయన ధర్మసాగర్ మండలం పరిధిలోని దేవాదుల ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వరంగల్, హనుమకొండ,కాజీపేట నగరాల ప్రజల దాహార్తిని తీర్చే సుప్రసిద్ధ భద్రకాళి చెరువు పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. దేవాదుల మూడో దశ ప్యాకేజీ కి సంబంధించిన 49.06 కిలోమీటర్ల పొడవైన ప్రధాన సొరంగ మార్గం పనులను అయన సమీక్షించారు. ఇక్కడ ఇప్పటికే రెండో పంప్ హౌజ్ ప్రారంభమైనదని దీని ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్ కు 62 గంటల పాటు నీటిని నింపినట్లు ఆయన వివరించారు. మే మాసంతానికి మొదటి పంప్ హౌజ్,జులై మాసంతానికి మూడో పంప్ హౌజ్ లను ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం హనుమకొండ సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా సమీక్ష సమావేశంలో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సితక్కలతో కలిసి ఆయన పాల్గొన్నారు.
ఈ సమీక్షా సమావేశంలో లోకసభ సభ్యులు కడియం కావ్య,శాసనమండలి సభ్యులు రామచంద్ర నాయక్,బసవరాజు సారయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజయ్య,మేయర్ గుండు సుధారాణి,శాసనసభ్యులు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి,నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు,యశస్విని రెడ్డి, మురళి నాయక్ నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్ చౌహన్,ఇ. ఎన్.సి అనిల్ కుమార్ లతో పాటు హనుమకొండ కలెక్టర్ ప్రావిన్యా రెడ్డి,వరంగల్ కలెక్టర్ సత్య శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో కోటి 80 లక్షల కోట్ల రూపాయలు నీటిపారుదల రంగంలో ఖర్చు చేసినా కొత్తగా ఆయకట్టు సృష్టించలేక పోయారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల అంచనాలు భారీగా పెంచడం వంటి తప్పిదాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టు లను నిర్ణిత వ్యవధిలో పూర్తి చేసి ఖర్చు పెట్టె ప్రతి రూపాయి రైతులకు సాగు నీరు అందించేందుకు వినియోగిస్తామన్నారు.దేవాదుల ప్రాజెక్టు పూర్తికి ఒకేసారి సరిపడా నిధులు విడుదల చేసి పనులు వేగవంతం చేస్తామన్నారు.దేవాదుల ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా ఆరు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. దేవాదుల పూర్తికి అదనంగా 3,312 కోట్లు అవసరమౌతున్నదని ఆయన వివరించారు. అయితే సొరంగమార్గం చివరలో లీకేజీలను నివారించేందుకు గాను మిషన్ భగీరథ పైప్ లైన్ పనులకు ఆటంకం కలుగ కుండా ఉండేందుకు కామారెడ్డి జిల్లా మంజీరా ప్రాజెక్టు నుండి 110 పెద్ద సైజ్ స్టీల్ పైపులు తెప్పించినట్లు ఆయన పేర్కొన్నారు వాటిని మూడు వరుసలుగా అమలు పరుస్తున్నట్లు మే మాసంతానికి పూర్తి అయితాయని ఆయన తెలిపారు వరంగల్, హనుమకొండ, కాజీపేట మూడు నగరాల ప్రజల దాహార్తిని తీర్చే సుప్రసిద్ధ భద్రకాళి చెరువు పూడిక తీత పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.11.5 లక్షల క్యూబిక్ మీటర్లలోతు పేరుకు పోగా ఇప్పటికే 2.7 లక్షల క్యూబిక్ మీటర్లు తొలగించి నట్లు ఆయన తెలిపారు మిగిలిన మట్టిని తొలగించేందుకు 16.కోట్ల రూపాయల ను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణా యావత్ భారతదేశంలోనే సరికొత్త రికార్డు నెలకొల్పిందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం పట్ల వ్యవసాయం పట్ల అనుసరించిన విధానాలతోటే ఇది సాధ్యపడిందన్నారు. ఖరీఫ్ సీజన్ లో 153 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు దిగుబడితో రికార్డు నెలకొల్పిన తెలంగాణా రాష్ట్రం ప్రస్తుత యాసంగిలోనూ అదే రికార్డు పునరావృతం కాబోతుందని ఆయన తెలిపారు.
యాసంగి సీజన్ లోను వానకాలం రికార్డును సమం చేస్తూ ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రబీ సీజన్ లో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు ఇప్పటికే 28 లక్షల 58 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిందన్నారు.
రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,32,347 రైతుల నుండి కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో సన్నాలు 10 లక్షల 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాం ఉండగా 14.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకాలని ఆయన వివరించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం విలువ 5,664.09 కోట్లు కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించిన మొత్తం 3,163.47 కోట్లు అని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాలో నగదును జమ చేస్తున్నట్లు ఆయన వివరించారు
యాసంగిలోనూ సన్నాలకు బోనస్ లు చెల్లిస్తున్నామన్నారు. అర్హులైన నిరుపేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పంపిణీ దేశ చరిత్రలోనే చారిత్రాత్మకమైన మార్పుగా ఆయన అభివర్ణించారు పేదల కళ్ళలో వెలుగులు నింపాలి అన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమన్నారు

# నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు: మంత్రి పొంగులేటి

"తప్పు జరిగిందని చెబితే చాలు.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. టోల్‌ఫ్రీ నెంబర్ ఇస్తాం.. దానికి ఫోన్ చేసి వివరాలు చెప్పవచ్చు. నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలి.. దీనిలో మరో మాట లేదు. ఇళ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత వాడుతున్నాం. ఫేజ్ 1 నుంచి ఫేజ్ 4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలి. అర్హులను ఎంపిక చేసేటప్పుడు అన్ని విషయాలూ పరిశీలించాలి. ఇళ్ల నిర్మాణంలో చిన్న ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదు" అని పొంగులేటి తెలిపారు.
నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు 400600 చ.అడుగుల మధ్యే నిర్మించుకోవాలని అలాంటి వాటికే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి మండలంలోని ఓ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపట్టామని అయితే కొన్ని ప్రాంతాల్లో 600 చ.అడుగులు దాటి నిర్మించుకుంటున్నారని అలాంటి వాటికి బిల్లులు హోల్డ్ లో పెట్టామన్నారు. అయితే వీటిని పడగొట్టడం కంటే ప్రస్తుతానికి 600 చ.అడుగులు దాటి బేస్ మెంట్ పూర్తయిన ఇళ్లకు ఈ సారికి మినహాయింపు ఇచ్చి రూ.లక్ష రిలీజ్ చేస్తామని చెప్పారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు మించిన విస్తీర్ణంలో బేస్‌మెంట్ వరకు పూర్తయిన ఇళ్లు దాదాపు 300 వరకు ఉన్నాయని వీటికి మిహనహాయింపు ఇస్తామన్నారు. అయితే ఇది కేవలం బేస్ మెంట్ వరకు మాత్రమే మనిహాయింపు ఉంటుందని ఆపై జరిగే బ్రిక్స్ వర్క్ నిబంధనలకు అనుగుణంగా 400600 చ.అడుగులలోపు నిర్మిస్తేనే మిగతా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ మినహాయింపు కేవలం పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అవుతున్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుందన్నారు. న్యాక్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు ఇవాళ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మంత్రిగా నేను ఫోన్ చేసినా ఆ పని చేయొద్దు:
నిజమైన పేదలకే ఇళ్లు కేటాయించాలని దీనిలో మరో మాట లేదని మంత్రి అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి ఇంటిని ట్రాక్ చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ను పూర్తి స్థాయిలో వాడుతున్నామని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నాలుగు దశల్లో బిల్లులు చెల్లిస్తామన్నారు. ప్రతి సోమవారం అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించబోతున్నామని చెప్పారు. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా చివరకు మంత్రిగా నేను ఫోన్ చేసినా ఫేజ్ ల వారీగా వర్క్ పూర్తి కాకుండా బిల్లుల కోసం సిఫార్సు చేయవద్దని.. ఇంజినీర్లు ఫేజ్ 1 నుంచి ఫేజ్ 4 వరకు జాగ్రత్తగా సిఫారసు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలపై టోల్ ఫ్రీ నెంబర్ ఇస్తామని దాని ఫోన్ చేసి వివరాలు చెప్పాలన్నారు. తప్పు జరిగిందని చెబితే చాలు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గృహనిర్మాణ శాఖకు మంచిపేరుతేవాలని ఇంజినీర్లకు సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# మానవాళి ఎదుట ఉన్న అతిపెద్ద ముప్పు ఉగ్రవాదం

అంగోలాకు 200 మిలియన్ డాలర్ల రక్షణ రుణం

అంతేకాకుండా, అంగోలా అధ్యక్షుడు లారెన్సోతో ప్రధాని మోడీ, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాల రంగాలతో సహా మొత్తం ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం గురించి చర్చలు జరిపారు. అంగోలాకు 200 మిలియన్ డాలర్ల రక్షణ రుణాన్ని ప్రకటించారు. లారెన్సో భారత పర్యటన ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త దిశానిర్దేశం చేయడమే కాకుండా భారతదేశంఆఫ్రికా భాగస్వామ్యాన్ని కూడా బలోపేతం చేస్తుందని మోడీ అన్నారు. "అంగోలా రక్షణ దళాల ఆధునికీకరణకు మద్దతు ఇవ్వడానికి భారత్ 200 మిలియన్ డాలర్ల రక్షణ రుణాన్ని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను" అని ఆయన అన్నారు. రక్షణ రంగం బలోపేతం, సమగ్ర పరిశీలన, సరఫరాపై కూడ చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు, స్పేస్ టెక్నాలజీ, కెపాసిటీ బిల్డింగ్ వంటి రంగాల్లో భారతదేశం అంగోలాతో కలిసి పనిచేస్తుందని మోడీ అన్నారు. "ఆరోగ్య సంరక్షణ, వజ్రాల ప్రాసెసింగ్, ఎరువులు, కీలకమైన ఖనిజాల రంగాల్లో మా సంబంధాలను మరింత బలోపేతం చేయాలని కూడా మేం నిర్ణయించుకున్నాము." అని అన్నారు. భారత్ ఆఫ్రికన్ యూనియన్ మధ్య సంబంధాల్లో పురోగతి జరిగిందన్నారు. గ్లోబల్ సౌత్ కు ఇరు దేశాలు మూలస్థంభాలని అన్నారు. కాగా.. డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాల రంగాలతో సహా మొత్తం ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించిన మోడీకి అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సో ధన్యవాదాలు తెలిపారు.



# ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది : డిప్యూటీ సీఎం

ఈ కబురు : అధికారంలో ఉన్న లేకున్నా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులే తమకు వెన్నుదన్ను అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు శనివారం ఖమ్మం లోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. అధికారం శాశ్వతం కాదని తామెల్లపుడు ఉద్యోగుల పక్షాన ప్రజల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా కృషి చేస్తామన్నారు అలాగే ఉద్యోగులను, ప్రజలను కాపాడుకోవాదం తమ బాధ్యత అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటికీ తామ ప్రభుత్వం అదే పద్ధతి కొనసాగిస్తున్నామన్నారు గత పాలకులు చేసిన కొన్ని తప్పిదాలు కారణంగా ఆర్థిక వ్యవస్థ లోహభూఇష్టంగా తయారైందని దాన్ని సవరించే క్రమంలో సమస్యల పరిష్కారం పట్ల జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని వివరిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరంగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇంకా పెండింగ్ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కుల గణన కార్యక్రమం తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు దేశవ్యాప్తంగా కులగలను చేసిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం చరిత్రలో మిగిలిపోయిందని, దీనిలో మీ పాత్ర మరువలేనిదని, వెళ్లకట్టలేనిదని పేర్కొన్నారు ఇందులో భాగంగా బీసీ కులాలకు నిక్కచ్చి రిజర్వేషన్ అమలు కోసం చేపట్టిన సర్వే సత్ఫలితాలను ఇచ్చిందని ఆ మేరకు రిజర్వేషన్ అమలు ఫలాలు వారికి అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తామంతా నిబద్ధతతో కృషి చేస్తున్నామని, అలాగే మిగిలిన కులాలకు సంబంధించి కూడా వాస్తవ లెక్కలు రాబట్టేందుకు అవసరమైన సర్వే ద్వారా పూర్తి లెక్కలు తేలాయాన్నారు. ఇందుకోసం నియమించిన ఉద్యోగులు వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారని వాటిని పరిశీలించిన మీదట ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా రాజకీయ పదవులు పొందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఉద్యోగులు అధైర్య పడి పక్కదారి పట్టి ఇబ్బందులకు గురి కావద్దని ప్రతి సమస్య ప్రభుత్వం నిశితంగా పరిశీలించి పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి కమిటీలను వేస్తూ ముందుకు నడుస్తోందని దీనికి ఉద్యోగులంతా సహకరించాలని కోరారు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా ఉద్యోగులుగా తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆకాంక్షించారు.
మీ సహకారాన్ని మీరు చేసిన త్యాగాన్ని మేము ఎన్నటికీ మరువలేమని మేము ఎల్లప్పుడూ కుటుంబ పెద్దలుగా మీ మేలు కోరే విధంగా బాధ్యత అధికంగా మసులుకుంటామని వివరిస్తూ ఉద్యోగులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు దేవరకొండ సైదులు, మల్లెల రవీంద్రప్రసాద్, జడ్ ఎస్ జయపాల్ విజయకుమార్, సగుర్తి ప్రకాష్ రావు, ఎర్ర రమేష్, పర్వతపు శ్రీనివాస్, రవికుమార్, కె రుక్మారావు, ఎస్ లలిత కుమారి, ఎర్రమల శ్రీనివాస్, బుసా చంద్రశేఖర్, బిట్టా ప్రవీణ్ కుమార్, జంగం లక్ష్మణ్ రావు, వేమిశెట్టి కృష్ణారావు, బెజ్జంకి ఉపేంద్ర చారి, చెర్ల శ్రీనివాస్, ఎస్ కె సైదులు, కందులు విజయ్, దామల్ల వెంకటేశ్వర్లు, (సి ఎం), బందెల లలిత,కామల్ల రవితేజ, ఎన్ సందీప్, తదితరులు పాల్గొన్నారు.



# ఐటీ కారిడార్ లో పర్యటించిన జిహెచ్ఎంసి కమిషనర్



అధికారులతో కలిసి ఐటీ కారిడార్ లో పర్యటించిన గ్రేటర్ కమిషనర్

**నెలాఖరు నాటికి శిల్పా ఫేజ్-2 ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయాలని ఆదేశం**

ఈకబురు,శేరిలింగంపల్లి : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ (జిహెచ్ఎంసి) కమిషనర్ ఆర్ వీ.కర్ణన్ శనివారం హైటెక్ సిటీ ఐటీ కారిడార్ పరిధిలో పర్యటించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావుతో పాటు పలువురు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి గచ్చిబౌలి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి గచ్చిబౌలి చౌరస్తా మీదుగా కొండాపూర్ వైపు చేపడుతున్న శిల్పా లే ఔట్ ఫేజ్ 2 ఫ్లై ఓవర్ పనులను పర్యవేక్షించారు. మిగిలి పోయిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, ఈ నెలాఖరు నాటికి ఫ్లై ఓవర్ పనులు మొత్తం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఫ్లై ఓవర్ కింద సర్వీసు రోడ్డు వివరాలను కమిషనర్ స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్వీస్ రోడ్డు పూర్తవుతుందని ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఆయనకు తెలియజేశారు. అనంతరం రాయదుర్గంలో పర్యటించిన కమిషనర్ హెచ్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా ఖాజాగూడ జంక్షన్లో చేపట్టనున్న ప్రతిపాదిత ఫ్లైఓవర్, అండర్పాస్ స్థలాన్ని పరిశీలించారు. ఖాజాగుడ చౌరస్తాలో ఫ్లై ఓవర్, అండర్ పాస్ నిర్మాణం కోసం అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాయదుర్గం మల్కం చెరువును పరిశీలించిన కమిషనర్ చెరువు వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, వీధి కుక్కల బెడదపై వాకర్లు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేసి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మల్కం చెరువు లోపలికి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుర్గం చెరువు, సమీప నివాస ప్రాంతాల నుండి చెరువులోకి వరద నీరు వస్తున్నట్లు అధికారులు వివరించారు. చెరువు లోపలికి మురుగు, వర్షపు నీరు రాకుండా నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ శంకర్ లతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# టికెట్ తీసుకోమన్న కండక్టర్ పై పిడిగుద్దులు

**రాయదుర్గంలో యువకులపై కేసు నమోదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులను టికెట్ తీసుకోమన్న పాపానికి కండక్టర్ మీద యువకులు మూకుమ్మడిగా దాడి చేసి పిడుగులు కురిపించారు. కండక్టర్ ను యువకుల భారి నుంచి కాపాడిన తోటి ప్రయాణికులు దాడికి పాల్పడిన యువకులను రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని బర్కత్ పురా ఆర్టీసి డిపోకు చెందిన రూట్ నెంబర్ 216 బస్సు లింగంపల్లి నుంచి కోఠికి వెళుతుంది. కాగా శుక్రవారం రాత్రి లింగంపల్లి నుంచి బయలుదేరిన ఈ బస్సు లో రాత్రి 8 గంటల ప్రాంతంలో గచ్చిబౌలి చౌరస్తా వద్ద ముందు నుంచి నలుగురు యువకులు, వెనుక ఓ మహిళ ఎక్కారు. టికెట్ తీసుకోవాలని మహిళ వద్దకు వెళ్లిన కండక్టర్ కు ముందున్న వ్యక్తులు తీసుకుంటారని చెప్పింది. ముందు కూర్చున్న వ్యక్తుల వద్దకు వెళ్లి టికెట్ కోసం అడగగా వెనుక ఉన్న మహిళ తీసుకుంటుందని వారు అనడంతో, అందరూ టికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని కండక్టర్ చెప్పాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరుగగా, కోపంతో ఊగిపోయిన యువకులు కండక్టర్ మీద దాడి చేసి పిడిగుద్దులు కురిపించారు. దీంతో బస్సులో ఉన్న మిగతా ప్రయాణికులు కండక్టర్ ను కాపాడి, దాడి చేసిన యువకులను నిలువరించారు. అనంతరం రాయదుర్గం పోలీసు స్టేషన్ వద్ద బస్సు ఆపి, దాడికి పాల్పడిన యువకులను పోలీసు స్టేషన్ లో అప్పగించారు. కండక్టర్ మాణిక్యం పిర్యాదు మేరకు

# శేరిలింగంపల్లిలో రూ.71.08 లక్షల కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

**పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే గాంధీ**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో నూతనంగా వివాహం చేసుకున్న లబ్ధిదారులకు 71.08 లక్షల రూపాయల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో గల కార్యాలయంలో తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేతులమీదుగా ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని కూకట్ పల్లి మండలం వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, కూకట్ పల్లి డివిజన్లకు చెందిన 71 మంది లబ్ధిదారులకు 71,08,236 రూపాయల కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. పేదింటి ఆడ బిడ్డకు ఓ పెద్దన్నగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలుస్తున్నాడని అన్నారు. నిరుపేద ఆడ బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం కింద ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదల ఇళ్లలో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, నాయకులు సంజీవ రెడ్డి, ప్రసాద్, దొడ్ల రామకృష్ణ గౌడ్, శ్రీధర్ రెడ్డి, అష్రాఫ్, బాలనర్సయ్య, అక్కిరెడ్డి, నిఖిల్ లతో పాటు లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

# శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ను కలిసిన రవీందర్ యాదవ్



జోనల్ కమిషనర్ తో బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ ను శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ గా ఐఏఎస్ అధికారి హేమంత్ రావడంతో నియోజకవర్గం అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న దీర్ఘకాల సమస్యలను, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లానని, కమిషనర్ సానుకూలంగా స్పందించారని రవీందర్ యాదవ్ తెలిపారు.

# గచ్చిబౌలి ఫుట్ బాల్ టాలెంట్ పూల్ కు అపూర్వ స్పందన



ఫుట్ బాల్ మ్యాచ్ లో పోటీపడుతున్న క్రీడాకారులు



స్టేడియంలో మ్యాచ్ కు హాజరైన ప్రేక్షకులు

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణలో ఫుట్‌బాల్ సంస్కృతిని పునరుద్ధరించేందుకు నగరంలో ఫుట్ బాల్ క్రీడకు పునర్ వైభవం తీసుకువచ్చే చర్యల్లో భాగంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, తెలంగాణ ఫుట్ బాల్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్, ఫిఫాల సంయుక్త ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న ఫుట్ బాల్ టాలెంట్ పూల్ కు అపూర్వ స్పందన లభిస్తోంది. శనివారం జరిగిన అండర్ 15 బాలుర టాలెంట్ హంట్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి దాదాపు 600మంది క్రీడాకారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా 11 మంది క్రీడాకారుల చొప్పున .. 30 జట్లుగా విభజించి, పోటీలు నిర్వహించి... వారి ప్రదర్శన, ఫుట్ బాల్ టెక్నిక్స్ రికార్డు చేశారు. ఆదివారం అండర్ 15 బాలుర కోసం, బాలికల కోసం మే 5,6 తేదీల్లో ఈ టాలెంట్ పూల్ కార్యక్రమం కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గచ్చిబౌలి స్టేడియంలో వర్క్ షాప్ ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# సింధూ నదిపై నిర్మాణాలు చేపడితే పేల్చేస్తాం.. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



ఈ కబురు: సింధూ నదీ జలాల ఒప్పందంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ భారత్‌ను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అగ్రిమెంట్ ప్రకారం సింధూ జలాలను పాక్‌కు ఇవ్వాలని, నీటిని దారి మళ్లిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సింధు జలాలను మళ్లించడం దురాక్రమణతో సమానమని అభివర్ణించారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. నీటిని ఆపడానికి సింధూ నదిపై భారత్ ఏవైనా నిర్మాణాలు చేపడితే వాటిని ధ్వంసం చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు సృష్టించడానికి ప్రయత్నించినా దాడులకు తెగబడతామని తెలిపారు. సింధూ ఒప్పందాన్ని ఉల్లంఘించడం భారత్ కు అంత సులభమైన విషయం కాదన్నారు. ఈ డీల్ పై తమ వాటాదారులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కాగా, పహల్గామ్ దాడి తర్వాత భారత్ సింధూ నది ఒప్పందాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. దీని వల్ల పాక్ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాక్ ఆందోళన చెందుతోంది.

# ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోని ఆల్బనీస్.. వరుసగా రెండోసారి అధికారంలోకి

**ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోనీ ఆల్బనీస్ వరుసగా రెండోసారి విజయం సాధించారు.**

ఈ కబురు: ఆస్ట్రేలియా ప్రధానిగా ఆంథోనీ ఆల్బనీస్ వరుసగా రెండోసారి విజయం సాధించారు. శనివారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ గెలుపొందింది. దీంతో 2004 తర్వాత వరుసగా అధికారంలోకి వచ్చిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. మరో మూడేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నేత పీటర్ డట్టన్ ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారు. తాము సరిగ్గా రాణించలేదని, ఫలితాల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు.

ప్రతినిధుల సభలోని 150 స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు క్రమంలో అధికార లేబర్ పార్టీ ఇప్పటికే 86 స్థానాల్లో విజయం సాధించి.. మెజార్టీ మార్కు (76) దాటేసింది. ద్రవ్యోల్బణం, ఇంధన విధానాలు, ఇళ్ల కొరత, వడ్డీ రేట్లలో పెరుగుదల వంటి సమస్యలే ప్రధాన అంశాలుగా ఎన్నికలు సాగాయి. ఓటింగ్ అనంతరం.. ఆల్బనీస్ సర్కారే మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఉందనే అంచనాలు వెలువడ్డాయి. 2022 నుంచి ప్రధానిగా ఉన్న ఆయన.. మరో మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత సమయంలో.. ఆస్ట్రేలియన్లు ఆశావాదం, దృఢ సంకల్పాన్ని ఎంచుకున్నారని తన విజయ ప్రసంగంలో ఆల్బనీస్ తెలిపారు.

**ప్రధాని మోదీ శుభాకాంక్షలు..**

వరుసగా రెండోసారి ఎన్నికైన ఆల్బనీస్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ''అఖండ విజయం సాధించి ఆస్ట్రేలియా ప్రధానిగా మరోసారి ఎన్నికైనందుకు అభినందనలు. ఈ తీర్పు మీ నాయకత్వంపై ఆస్ట్రేలియా ప్రజల విశ్వాసాన్ని సూచిస్తోంది. భారత్‌ఆస్ట్రేలియాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు, ఇండో పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వం కోసం మన ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లేలా కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాను'' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



# విఝింజమ్ పోర్టు నుంచే అన్ని భారత నౌకల ట్రాన్స్‌షిప్‌మెంట్



మనదేశానికి చెందిన అన్ని సరకు రవాణా నౌకల ట్రాన్స్‌షిప్‌మెంట్, ఏడాది వ్యవధిలోనే విఝింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్ నుంచి నిర్వహించగలమని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్(ఏపీఎస్ఈజడ్) ఎండీ కరణ్ అదానీ ధీమా వ్యక్తం చేశారు.

**తిరువనంతపురం:** మనదేశానికి చెందిన అన్ని సరకు రవాణా నౌకల ట్రాన్స్‌షిప్‌మెంట్, ఏడాది వ్యవధిలోనే విఝింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్ నుంచి నిర్వహించగలమని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్(ఏపీఎస్ఈజడ్) ఎండీ కరణ్ అదానీ ధీమా వ్యక్తం చేశారు. రూ.8,867 కోట్ల అంచనా వ్యయంతో పూర్తయిన ఈ పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం మన దేశానికి చెందిన 75% వరకు ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్గోను, ఇతర దేశాల్లోని పోర్టులే నిర్వహిస్తుండడంతో.. భారతీయ పోర్టులు ఏటా 200220 మి. డాలర్ల ఆదాయాన్ని కోల్పోతున్నాయి.

'విఝింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్‌లో మెరుగైన వసతులున్నాయి. ఒక ఏడాదిలోపు అన్ని భారతీయ నౌకలు ఇక్కడి నుంచే ట్రాన్స్‌షిప్ అవుతాయ'ని పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదానీ పేర్కొన్నారు. అంతర్జాతీయ షిప్పింగ్ మార్గానికి ఈ పోర్టు 10 నాటికల్ మైళ్ల దూరంలోనే ఉంది.

ఒక చిన్న నౌక నుంచి, సుదూర గమ్యాలకు ప్రయాణించే పెద్ద నౌకల్లోకి సరకు మార్చడమే ట్రాన్స్‌షిప్‌మెంట్. ఇందువల్ల రవాణా వ్యయాలు తగ్గుతాయి. అధిక లోతైన సముద్ర తీరం ఉన్న పోర్టులు ఈ ప్రక్రియకు అవసరం.

**విదేశీ పోర్టుల నుంచి మన వద్దకు...:** సింగపూర్, కొలంబో, సలాలా(ఒమన్), దుబాయ్ వంటి విదేశీ పోర్టుల్లో ప్రస్తుతం భారతీయ కార్గో ట్రాన్స్‌షిప్‌మెంట్ జరుగుతోంది. దీనిని మన దేశానికి తీసుకురావడమే విఝింజమ్ ప్రాజెక్టు ప్రాథమికోద్దేశం.

# అందుబాటులోకి ఐటీఆర్ 3





వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించిన వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి ఉపయోగించే ఐటీఆర్ 3ని ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది.

**నోటిఫై చేసిన ఆదాయపు పన్ను విభాగం**
దిల్లీ: వ్యాపారం, వృత్తి ద్వారా ఆదాయం ఆర్జించిన వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడానికి ఉపయోగించే ఐటీఆర్ 3ని ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. ఆదాయపు పన్ను గణించడంలో తీసుకొచ్చిన కొన్ని కీలక మార్పులను ఇందులో చేర్చారు. 'షెడ్యూల్ ఏఎల్' కింద ఆస్తులు, అప్పులను నివేదించే పరిమితిని రూ.50లక్షల నుంచి రూ.కోటికి పెంచారు. మూలధన లాభాల విషయంలో 2024 జులై 23కు ముందు లేదా తర్వాత వచ్చిన ఆదాయం ఆధారంగా మూలధన లాభాలను విభజించాలి. 2024 జులై 24న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో, స్థిరాస్తులపై దీర్ఘకాలిక మూలధన రాబడి గణించేందుకు కొత్త విధానంలో ద్రవ్యోల్బణ సర్దుబాటు సూచీతో అవసరం లేకుండా 12.5% పన్ను చెల్లించాలి. లేదా ద్రవ్యోల్బణ సూచీ సర్దుబాటుతో 20% పన్ను వర్తిస్తుంది. ఇప్పటికే ఐటీఆర్ 1, ఐటీఆర్ 4లను ప్రభుత్వం నోటిఫై చేసిన సంగతి విదితమే.

## పసిడి బాండ్ల మదుపర్లకు గోల్డెన్ ఛాన్స్..

# ₹లక్ష పెట్టిన వారికి ₹3 లక్షలు!



పసిడి బాండ్లలో మదుపు చేసిన వారికి బంగారం లాంటి అవకాశం దక్కింది. 8 ఏళ్ల క్రితం మదుపు చేసిన వారు మూడింతల లాభం పొందనున్నారు.

ఎనిమిదేళ్ల క్రితం సావరిన్ గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసిన వారికి జాక్‌పాట్ తగిలింది. 2017 మే నెలలో జారీ చేసిన పసిడి బాండ్లకు సంబంధించిన రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. మే 9ని మెచ్యూర్ తేదీగా నిర్ణయించింది. దీంతో అప్పట్లో పెట్టుబడులు చేసిన వారు దాదాపు మూడింతలు లాభం పొందనున్నారు. అంటే అప్పట్లో లక్ష రూపాయలు పెట్టుబడిగా పెట్టిన వారు రూ.3 లక్షలు పొందనున్నారన్న మాట. దీనికి వడ్డీ అదనం.

దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబర్‌లో ఆర్‌బీఐ ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8 ఏళ్లు. 2017 మే నెలలో 201718 సిరీస్ 1 పసిడి బాండ్లను జారీ చేశారు. అప్పట్లో 999 స్వచ్ఛత కలిగిన గ్రాము బంగారం ధరను రూ.2,951గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి రూ.50 డిస్కౌంట్ ఇచ్చారు.

అప్పట్లో జారీ చేసిన బాండ్లకు మెచ్యూరిటీ ధరను తాజాగా ఆర్‌బీఐ ప్రకటించింది. మే 9ని మెచ్యూరిటీ తేదీగా నిర్ణయించింది. గ్రాము ధరను రూ.9,486గా నిర్ణయించారు. అంటే అప్పట్లో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు దాదాపు రూ.3 లక్షలు లభిస్తుంది. దీనికి గోల్డ్ బాండ్లపై ఇచ్చే వడ్డీ అదనం. ఏటా 2.50 శాతం నామమాత్ర వడ్డీని బాండ్ల కొనుగోలుపై ఆర్‌బీఐ చెల్లిస్తుంది.

**ధరెలా నిర్ణయిస్తారు?**
గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం 999 స్వచ్ఛత కలిగిన బంగారానికి ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. అలా గ్రాము ధరను రూ.9486గా నిర్ణయించారు. ఏప్రిల్ 28 మే 2 మధ్య ధరల సగటు ఆధారంగా గ్రాము ధరను నిర్ణయించారు.

ఇటీవల పసిడి ధర రూ.1లక్ష మార్కు దాటిన వేళ పసిడి బాండ్లు రిడెంప్షన్‌కు రావడం అప్పటి మదుపర్లకు గోల్డెన్ ఛాన్స్ అనే చెప్పాలి. పైగా వచ్చిన మొత్తానికి ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించక్కర్లేదు. 2015 16 బడ్జెట్‌లో తీసుకొచ్చిన ఈ పథకం కింద కేంద్రం తరఫున ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేస్తుంది. అయితే, చివరి సారిగా 2024 ఫిబ్రవరి 1216 మధ్య సబ్‌స్క్రిప్షన్‌కు అనుమతిచ్చారు. ఆ తర్వాత ఈ బాండ్లను జారీ చేయలేదు. ఖజానాకు భారం కావడంతో ఈ బాండ్ల జారీని ప్రభుత్వం నిలిపివేసింది.





# అమెరికాకు రూటు మారుతోంది




దిల్లీ నుంచి ఉత్తర అమెరికా నగరాలకు వెళ్లే విమానాలకు, ప్రత్యామ్నాయ మార్గాలను ఎయిరిండియా అన్వేషిస్తోంది.

**దిల్లీ:** దిల్లీ నుంచి ఉత్తర అమెరికా నగరాలకు వెళ్లే విమానాలకు, ప్రత్యామ్నాయ మార్గాలను ఎయిరిండియా అన్వేషిస్తోంది. మనదేశంలోనే దిల్లీ నుంచి మరో నగరానికి వచ్చి.. అక్కడ నుంచి అమెరికాకు బయలుదేరే అవకాశాలనూ పరిశీలిస్తోంది. తద్వారా పాకిస్థాన్ గగనతల ఆంక్షల వల్ల, అధిక దూరం ప్రయాణించేందుకు అవుతున్న వ్యయ భారాన్ని తగ్గించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వారానికి 71 విమానాలను ఉత్తర అమెరికాకు ఎయిరిండియా నిర్వహిస్తోంది. అందులో 54 సర్వీసులు దిల్లీ నుంచే వెళ్తున్నాయి. 'ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నాం. విదేశీ టెక్‌స్టాప్స్ సంఖ్య తగ్గించడం, మరిన్ని నాన్‌స్టాప్ సర్వీసులను త్వరలోనే పెంచుతామ'ని ఎయిరిండియా ఎండీ, సీఈఓ తమ సిబ్బందికి పంపిన సమాచారంలో పేర్కొన్నారు. పాకిస్థాన్ గగనతల మూసివేత వల్ల దిల్లీ సహా ఉత్తర భారత నగరాల నుంచి అమెరికా వెళ్లే విమానాలన్నీ అరేబియా సముద్రం మీదుగా, సుదీర్ఘ మార్గాల్లో వెళ్తున్నాయి. ఇందువల్ల ప్రయాణ సమయం, వ్యయాలు అధికమవుతున్నాయి.

**ఇలా పరిశీలిస్తోంది..:** దిల్లీ నుంచి అమెరికా వెళ్లే విమానాలకు.. ముంబయి లేదా అహ్మదాబాద్‌ను టెక్నికల్ స్టాప్‌గా తీసుకోవడం ద్వారా ఐరోపా నగరాల్లో ఆపాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని ఎయిరిండియా భావిస్తున్నట్లు సమాచారం.

**ఎంత నష్టమంటే..:** పాకిస్థాన్ గగనతల మూసివేత వల్ల ఏడాదికి 600 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,200 కోట్ల) అదనపు వ్యయాలు కావొచ్చని ఎయిరిండియా అంచనా వేసినట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద భారతీయ విమానయాన కంపెనీలకు నెలకు రూ.306 కోట్ల అదనపు వ్యయాలు అవ్వొచ్చని అంచనా.

భారత విమానయాన సంస్థలకు మాత్రమే తమ గగన తలాన్ని మూసివేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. అయితే మన దేశానికి సర్వీసులు నిర్వహిస్తున్న పాశ్చాత్య దేశాల విమానయాన సంస్థలు కూడా ఐచ్ఛికంగా పాకిస్థాన్ గగనతలానికి ప్రత్నామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నాయని సమాచారం. పాకిస్థాన్ గగనతలంలో ప్రయాణించినందుకు ఆయా విమానయాన సంస్థలు ప్రతినెలా చెల్లించే మిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయాన్ని ఆ దేశం కోల్పోతోంది. 2019 ఫిబ్రవరిలోనూ భారత్‌తో వివాదం నేపథ్యంలో, గగనతలంపై నిషేధం విధించిన పాకిస్థాన్ అయిదు నెలల్లో 10 కోట్ల డాలర్లు కోల్పోయింది.

**ఈ సంస్థలన్నీ:** గత 2 రోజుల్లో లుఫ్తాన్సా (జర్మనీ), బ్రిటిష్ ఎయిర్‌వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఐటీఏ (ఇటలీ), ఎల్‌ఓటీ (పోలండ్) వంటి ఐరోపా దేశాల ప్రధాన విమానయాన కంపెనీలు పాకిస్థాన్ గగనతలాన్ని వాడటం మానేశాయి. ఇందువల్ల ఐరోపా, భారత నగరాల మధ్య ప్రయాణ సమయం గంట పెరిగింది. ఇందుకోసం ఇంధన వ్యయం అధికమైనందున, ఆ భారాన్ని ప్రయాణికులకే సంస్థలు బదలాయిస్తున్నాయి.

**పాకిస్థాన్ విమానయాన సంస్థలకూ భారం:** పాకిస్థాన్ విమానయాన సంస్థలు నిర్వహించే విమానాలకు భారత గగనతలాన్ని నిషేధించారు. ఇందువల్ల పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్‌కు ఆర్థిక భారం తలెత్తుతోంది. ఇస్లామాబాద్ నుంచి కౌలాలంపూర్‌కు 5.30 గంటల్లో చేరాల్సిన విమానం, చుట్టూతిరిగి వెళ్లేసరికి 8.30 గంటల సమయం పడుతోంది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక వెళ్లాల్సిన విమానాలూ చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే.

మనదేశంలో ఉత్తర ప్రాంతం ముఖ్యంగా దిల్లీ నుంచి విదేశాలకు వెళ్తున్న విమానాలకే పాకిస్థాన్ అడ్డంకి ఎక్కువగా ఉంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దక్షిణ ప్రాంతాలతో పాటు అహ్మదాబాద్, ముంబయి వంటి విమానాశ్రయాల నుంచి బయలుదేరి వెళ్లే విమానాలకు ఇబ్బందులు లేవని నిపుణులు చెబుతున్నారు.




## క్రెడిట్ కార్డు మినిమమ్ డ్యూ కడుతున్నారా?

# లాభనష్టాల మాటేంటి?

**క్రెడిట్ కార్డు వాడేవాళ్లలో చాలా మంది మినిమమ్ డ్యూ కట్టేవాళ్లు ఉంటారు. దీనివల్ల కలిగే లాభనష్టాలేంటో ఈ కథనంలో చర్చిద్దాం..**

ఒకప్పుడు ఏదైనా కొనాలంటే డబ్బులు చేతిలో ఉంటేనే సాధ్యం. కానీ, రోజులు మారాయి. పరిస్థితులూ మారాయి. క్రెడిట్‌కార్డులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో క్షణాల్లో అప్పు పుడుతోంది. వాటితో కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయడం సులువైపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా క్రెడిట్ కార్డు చేతిలో ఉంటే చాలు.. కావాల్సినంత షాపింగ్ చేయొచ్చు. ఇంతవరకు బాగానే ఉంది. మరి బిల్లు మాటేంటి? చేతిలో డబ్బులున్నా క్రెడిట్ కార్డు వినియోగించి.. బిల్లొచ్చాక చెల్లించే వారు కొందరైతే.. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా క్రెడిట్ కార్డును ఎడాపెడా వాడేసి తర్వాత నిట్టూర్చేవారు ఇంకొందరు. దీంతో చేసేది లేక 'మినిమమ్ బిల్లు' చెల్లించి తాత్కాలిక ఊరట పొందుతుంటారు. ఇలా చేయడం వల్ల జరిగే లాభనష్టాలను చర్చిద్దాం.

క్రెడిట్ కార్డు బిల్లు వచ్చేటప్పుడు మూడు రకాల పేమెంట్ ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో ఒకటి మినిమమ్ అమౌంట్ డ్యూ, పూర్తి మొత్తం, అదర్ అమౌంట్. ఏ నెలకాలనెల పూర్తి మొత్తం చెల్లిస్తే ఇబ్బంది లేదు. కానీ, బిల్లు మొత్తం కట్టకుండా ఆ నెల కొంత మొత్తం మాత్రమే చెల్లించడమే మినిమమ్ అమౌంట్ పేమెంట్ లేదా మినిమమ్ డ్యూ అంటారు. అన్ని బ్యాంకులు/ ఎన్‌బీఎఫ్‌సీలు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. చాలా వరకు బ్యాంకులు మొత్తం బిల్లులో 5 శాతం దీని కింద చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకులను బట్టి ఈ మొత్తంలో స్వల్ప మార్పులుండొచ్చు. చాలామంది 'మినిమమ్' చెల్లిస్తే ఎలాంటి వడ్డీ పడదని అనుకుంటారు. అది వాస్తవం కాదు. కనీస చెల్లింపుల వల్ల పెనాల్టీలు, లేటు ఫీజుల నుంచి మాత్రమే మీకు ఊరట లభిస్తుంది. చెల్లించాల్సిన మొత్తానికి బ్యాంకు మీకు వడ్డీ విధిస్తుంది.


**ఉదా:** రవి అనే ఉద్యోగి మే నెలలో క్రెడిట్ కార్డుతో రూ.20 వేలు ఖర్చు చేశాడనుకుందాం. జూన్‌లో ఆ మొత్తం బిల్లు కట్టాల్సి ఉంటుంది. అయితే, ఆ నెల అతడి వద్ద డబ్బులు లేకుంటే మినిమమ్ బిల్లు కట్టేసి బయటపడొచ్చు. అంటే ఓ వెయ్యి రూపాయలు చెల్లిస్తే చాలు. ఆ తర్వాతి నెలలో రూ.19వేలతో పాటు దానికి బ్యాంకు విధించే వడ్డీ కలిపి చెల్లించాలి. ఆ నెల కూడా కొంత మొత్తం షాపింగ్ చేస్తే అది కూడా తర్వాతి నెల బిల్లింగ్‌లో చెల్లించాల్సి ఉంటుంది.

**'మినిమమ్' కడితే ఏం జరుగుతుంది?**

- కనీస మొత్తం చెల్లించడం వల్ల ఆ నెల పెద్ద మొత్తంలో బిల్లు చెల్లింపు భారం తప్పుతుంది.
- కనీస మొత్తం చెల్లిస్తే మీ అకౌంట్ రెగ్యులర్‌గా ఉంటుంది. అంటే మిమ్మల్ని బ్యాంక్ డిఫాల్ట్‌గా గుర్తించదు.
- స్వల్ప మొత్తం చెల్లించడం వల్ల బ్యాంకులు మీ నుంచి ఆలస్య రుసుములు వసూలు చేయవు.
- మినిమమ్ డ్యూ కడితే క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలకు 'డిఫాల్ట్' అనే సమాచారం వెళ్లదు. దీంతో ఆ మేర క్రెడిట్ స్కోరును కోల్పోకుండా ఉంటారు.




**నష్టాల విషయానికొస్తే..** కనీస మొత్తం చెల్లిస్తే బ్యాంకులు భారీ వడ్డీని విధిస్తాయి. చెల్లించాల్సిన మొత్తానికి దాదాపు 36 శాతం నుంచి 48 శాతం వరకూ వడ్డీని వసూలు చేస్తాయి.
కొన్ని నెలల పాటు మీరు కనీస మొత్తం చెల్లించుకుంటూ పోతే వడ్డీతో పాటు అప్పుల భారం కూడా పెరిగిపోతుంది. దాన్ని తీర్చడానికి మరింత అప్పు చేయాల్సి రావొచ్చు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.
కనీస మొత్తం చెల్లించడం, దానిపై మరికొంత మొత్తం వాడుకుంటూ వెళ్లడం వల్ల మీ క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో పెరిగిపోతుంది. దీనివల్ల క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుంది.
ఏ నెలకానెల మీ క్రెడిట్ కార్డు రుణాన్ని వాయిదా వేసుకుంటూ వెళ్లడం వల్ల కొత్తగా రుణాలు, క్రెడిట్ కార్డులు పొందాలంటే కష్టంగా మారొచ్చు. మీకు రుణం జారీ చేయడం రిస్క్‌తో కూడుకున్నదని బ్యాంకులు భావించే ప్రమాదం ఉంది.
క్రెడిట్ కార్డు ఉంటే మన చేతిలో అత్యవసర నిధి ఉన్నట్లే చాలా మంది భావిస్తుంటారు. అలాంటి వారికి క్రెడిట్‌కార్డు ఆపత్కాలంలో పనిచేస్తుంది. ఒకవేళ మీరు క్రెడిట్ కార్డును మినిమమ్ బిల్లు కట్టుకుంటూ వెళితే అత్యవసర సమయాల్లో మీకు ఇబ్బందులు ఎదురవ్వొచ్చు.



వివాదంపై క్లారిటీ ఇచ్చిన

# విజయ్ దేవరకొండ.. ప్రెస్‌నోట్ రిలీజ్

ఇటీవల 'రెట్రో' ప్రీ రిలీజ్‌లో చేసిన వ్యాఖ్యలపై విజయ్ దేవరకొండ క్లారిటీ ఇచ్చారు. ఎవరినీ బాధపెట్టడం తన ఉద్దేశం కాదన్నారు.
ఇటీవల జరిగిన 'రెట్రో' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. తన వ్యాఖ్యలపై విజయ్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. ఎవరినీ బాధపెట్టడం తన ఉద్దేశం కాదన్నారు.
"నేను 'రెట్రో' ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కొందరి మనోభావాలను దెబ్బతీసినట్లు నా దృష్టికి వచ్చింది. వీటిపై క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నాను. ఏ వర్గాన్నీ, ఏ తెగనూ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. వారిని నేను ఎంతో గౌరవిస్తాను. భారత దేశంలోని ప్రజలంతా ఒక్కటేనని భావిస్తాను. మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి. ఐక్యంగా నిలబడాలి. నేను ఏ సమూహంపై ఉద్దేశపూర్వకంగా ఎప్పుడూ వివక్ష చూపలేదు. వారందరూ నా కుటుంబ సభ్యులు, నా సోదరులే అని అనుకుంటాను. నేను చేసిన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నాను. శాంతి గురించి మాట్లాడడమే నా ఏకైక లక్ష్యం"
"చారిత్రక, నిఘంటు దృష్టికోణంలోనే నేను ఆ పదాన్ని ఉపయోగించాను. వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. బ్రిటిష్ వారు భారత దేశాన్ని పాలించడం మొదలు పెట్టిన తర్వాత ఇలా వర్గీకరణ అనేది జరిగింది. అలా జరిగి కనీసం 100 సంవత్సరాలు కూడా పూర్తి కాలేదు" అని వివరణ ఇచ్చారు.
విజయ్ దేవరకొండ ఆ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. గిరిజనులను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ తెలంగాణ ట్రైబల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది కిషన్‌రాజ్ చౌహాన్, ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.



# ఫొటోల్లో ఉన్న పాప ఎవరో చెప్పేసిన శ్రీలీల..



ఇటీవల తాను షేర్ చేసిన ఫొటోల్లో ఉన్న పాప ఎవరో శ్రీలీల చెప్పారు.
తాజాగా మరో ఫొటో షేర్ చేశారు.

నటి శ్రీలీల ఇటీవల షేర్ చేసిన కొన్ని ఫొటోలు, వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ తెగ వైరల్ అయిన విషయం తెలిసిందే. చిన్న పిల్లతో ఉన్న పిక్స్ షేర్ చేసిన నటి.. 'మా కుటుంబంలోకి కొత్త వ్యక్తి వచ్చేసింది' అని క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆమె మరో పాపను దత్తతు తీసుకుందని జోరుగా ప్రచారం జరిగింది. శ్రీలీల మూడేళ్ల క్రితం ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. ఇప్పుడు మరో పాపను కూడా తీసుకున్నారని నెట్టింట ఆమెకు సంబంధించిన ఎన్నో కథనాలు వెలువడ్డాయి. తాజాగా ఆ పాప ఎవరో చెబుతూ శ్రీలీల మరో ఫొటో పోస్ట్ చేశారు. ఆమె తన సోదరి కుమార్తె అని తెలిపారు. " సోదరి కుమార్తె మా ఇంటికి కొత్త కళ తీసుకొచ్చింది. ముఖ్యంగా పిన్నిలో మరింత జోష్ నింపింది" అని పేర్కొన్నారు.

### నటిగా రాణిస్తోన్న శ్రీలీల..

ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతున్నారు. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. టాలీవుడ్‌లో వరుస సినిమాలతో అలరిస్తోన్న ఆమె.. బాలీవుడ్‌లోనూ తన హవా చూపేందుకు సిద్ధమయ్యారు. కార్తిక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ ఏడాది దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

### 'పెద్ది'లో శ్రీలీల..

గతేడాది వచ్చిన 'పుష్ప 2'లో శ్రీలీల చేసిన స్పెషల్ సాంగ్ యూత్‌లో జోష్ నింపింది. తాజాగా ఆమె మరో భారీ ప్రాజెక్ట్‌లో స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న 'పెద్ది'లో శ్రీలీల ప్రత్యేక గీతంలో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# నేరుగా ఓటీటీలోకి సుమంత్ మూవీ.. 'అనగనగా' కొత్త రిలీజ్ డేట్ ఇదే

సుమంత్ హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'అనగనగా'. ఈ సినిమా నేరుగా ఓటీటీలోకి రానున్న సంగతి తెలిసిందే.
సుమంత్ హీరోగా రూపొందిన ప్రముఖ ఓటీటీ 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీ 'అనగనగా' . కాజల్ చౌదరి హీరోయిన్. సన్నీ కుమార్ దర్శకత్వం వహించారు. మే 8 నుంచి స్ట్రీమింగ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. మే 15న రిలీజ్ చేస్తున్నట్టు ఓటీటీ సంస్థ సోషల్ మీడియా వేదికగా శనివారం ప్రకటించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రత్యేక వీడియో ఆకట్టుకునేలా ఉంది. 'ప్రతి కథా ఎందుకు 'అనగనగా' అని మొదలవుతుంది?' అని కుమారుడు అడిగిన ప్రశ్నకు హీరో ఇచ్చిన సమాధానం ఆసక్తికరం.
ఈ సినిమాలో సుమంత్ ఉపాధ్యాయుడిగా నటించారు. నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడంతోపాటు చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే త్వరగా అర్థమవుతుందో చెప్పే ప్రయత్నం చేసినట్టు కొన్ని రోజుల క్రితం విడుదలైన టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచకూడదని.. కాన్సెప్టు నేర్చుకుంటే చాలు మార్కులు వాటంతట అవే వస్తాయనేది ఆ ఉపాధ్యాయుడి నమ్మకం. మరి, ఆయన ప్రయత్నం ఫలించిందా? వీరి కుమారుడు ఎన్ని మార్కులు సంపాదించాడు? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.



# ముచ్చటగా మూడోసారి?





కథానాయకుడు చిరంజీవి తన కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

కథానాయకుడు చిరంజీవి తన కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంఛనంగా ప్రారంభమైన ఈ చిత్రం ఇప్పుడు రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో పడింది చిత్రబృందం. ఇందులో చిరుకు జోడీగా ఇద్దరు కథానాయికలు కనిపించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి.
కాగా, అందులో ఓ నాయిక పాత్ర కోసం నటి నయనతారను రంగంలోకి దించేందుకు చిత్ర వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై నయన్‌తో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇది చిరు - నయన్‌ల కాంబోలో హ్యాట్రిక్ సినిమా కానుంది. వీళ్లిద్దరూ గతంలో 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' సినిమాల్లో కలిసి సందడి చేశారు. ఇక ఈ చిత్రంలో మరో పాత్ర కోసం ఓ యువ నాయికను ఖరారు చేయనున్నారు. వినోదం, యాక్షన్, కుటుంబ అంశాలతో అల్లుకున్న కథతో రూపొందనున్న చిత్రమిది. చిరంజీవి దీంట్లో శివ శంకర వరప్రసాద్‌గా తన ఒరిజినల్ పేరుతో ఉన్న పాత్రలో కనిపించనున్నారు. హీరో వెంకటేశ్ ఓ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్నారు. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.



# దిల్ రాజు 'ఏఐ' స్టూడియో.. ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

టాలీవుడ్ ప్రొడ్యూసర్‌కు చెందిన ఏఐ స్టూడియోను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు కు చెందిన 'లార్వెన్ ఏఐ' స్టూడియోను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం ప్రారంభించారు. స్టూడియో లోగోను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్శకులు రాఘవేంద్రరావు, అనిల్ రావిపూడి, వి.వి. వినాయక్ తదితరులు పాల్గొన్నారు.
" రెండేళ్ల క్రితం ఏఐ స్టూడియో ప్రారంభించాలన్న ఆలోచన వచ్చింది. అలా 'క్వాంటమ్ ఏఐ'ను సంప్రదించాం. సినిమా పరంగా ఏఐ ఎంతగా ఉపయోగపడుతుందో చర్చించాం. ప్రీ ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్స్.. ఇలా సినిమా నిర్మాణంలో ఏఐ భాగం కానుంది. స్క్రిప్టు పూర్తయితే.. ఏఐ ద్వారా సౌండ్ ఎఫెక్ట్స్ , విజువల్స్‌తో మనం సినిమా చూసేయొచ్చు. అదే మా మేజర్ టార్గెట్. భవిష్యత్తులో మరిన్ని మార్పులు తీసుకొస్తుంది. ఏఐ ద్వారా సినిమాల సక్సెస్ రేట్ పెరిగే అవకాశం ఉంది. దర్శక, రచయితలకు సమయం, నిర్మాతలకు డబ్బు ఆదా అవుతుంది. దాంతో మరిన్ని చిత్రాలు తెరకెక్కించొచ్చు. ఎమోషన్స్‌లేని ఏడీ (అసిస్టెంట్ డైరెక్టర్) అవుతుంది" అని దిల్‌రాజు పేర్కొన్నారు.



# ఇంగ్లాండ్‌లో సుదర్శన్‌ను ఆడించాలి



సాయి సుదర్శన్ మూడు ఫార్మాట్లకు సరిపోయే బ్యాటర్ అని.. ఇంగ్లాండ్‌తో జరగబోయే టెస్టు సిరీస్‌లో భారత జట్టులో ఆడటానికి అర్హుడని టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు.

దుబాయ్: సాయి సుదర్శన్ మూడు ఫార్మాట్లకు సరిపోయే బ్యాటర్ అని.. ఇంగ్లాండ్‌తో జరగబోయే టెస్టు సిరీస్‌లో భారత జట్టులో ఆడటానికి అర్హుడని టీమ్ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న సుదర్శన్.. ఈ సీజన్లో స్థిరంగా రాణిస్తున్న నేపథ్యంలో శాస్త్రి ఇలా వ్యాఖ్యానించాడు.

''యువ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు మూడు ఫార్మాట్లు ఆడగలిగే సత్తా ఉంది. అతడో క్లాస్ ప్లేయర్. ఎడమచేతి వాటం బ్యాటర్ కావడం, మెరుగైన టెక్నిక్ ఉండడం సుదర్శన్‌ను ఇంగ్లాండ్ సిరీస్ రేసులోకి తీసుకొచ్చాయి. శ్రేయస్ అయ్యర్ కూడా పునరాగమనం చేసే అవకాశం ఉంది. అతడికి పోటీ తప్పదు'' అని శాస్త్రి అన్నాడు. గాయాల నుంచి కోలుకుని బుమ్రా, షమి అందుబాటులోకి వచ్చినా...జట్టులో ఒక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఉండాలని తెలిపాడు. ''ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత బౌలింగ్ దళంలో ఒక లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ ఉండాలి. అతడిని ఆరో బౌలింగ్ ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు. అర్ష్‌దీప్ సింగ్ లాంటి పరిమిత ఓవర్ల క్రికెట్ నిపుణుడు అయినా పర్వాలేదు. అర్ష్‌దీప్‌ను తెల్లబంతి క్రికెట్‌కే పరిమితం చేయడం నాకు నచ్చదు. అతడు 1520 ఓవర్లు వేయగలిగితే జట్టు కూర్పులో బాగా ఇమడగలడు. అర్ష్‌దీప్ మాత్రమే కాదు ఖలీల్ అహ్మద్ కూడా మెరుగైన ప్రత్యామ్నాయమే'' అని శాస్త్రి పేర్కొన్నాడు. మీడియా, సాంకేతిక పరిజ్ఞానం అనేవి క్రికెట్ కిట్‌లో హెల్మెట్ లాంటివని అతడు అభివర్ణించాడు.

''క్రికెట్ కిట్‌లో బ్యాట్, ప్యాడ్ ఇలా చాలా ఉంటాయి. అలాగే హెల్మెట్ కూడా ఉంటుంది. ఇది చాలా ముఖ్యమైంది. అలాగే ప్లేయర్లకు మీడియా, సాంకేతిక పరిజ్ఞానం కూడా హెల్మెట్ లాంటివే. వీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కూడా వచ్చింది. ఇవన్నీ ప్లేయర్లకు లాభం చేకూర్చేవే. ఆట అభివృద్ధి కోసం ఈ సాంకేతిక పరిజ్ఞానం బాగా ఉపయోగపడుతుంది. మా సమయంలో రేడియో, టీవీ మాత్రమే ఉండేవి. ఈ వేదికలు లేకుండా అభిమానులకు క్రికెట్ ఇంతగా చేరువ అయ్యేది కాదు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో ఆట మరింతగా ముందుకెళుతోంది'' అని శాస్త్రి తెలిపాడు.





# ఉత్కంఠ పోరులో ఆర్సీబీ విజయం..



**ప్లేఆఫ్స్ బెర్తు ఖాయం**
**ఐపీఎల్ 18లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**బెంగళూరు:** ఐపీఎల్ 18లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. 214 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే (94; 48 బంతుల్లో 9×4, 5×6), రవీంద్ర జడేజా (77; 45 బంతుల్లో 8×4, 2×6 నాటౌట్) మెరుపులు మెరిపించారు. షేక్ రషీద్ 14, ఎంఎస్ ధోనీ 12, సామ్ కరణ్ 5, బ్రెవిస్ 0 విఫలమయ్యారు. శివమ్ దూబే 8 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆర్సీబీ బౌలర్లలో లుంగి ఎంగిడి 3, కృనాల్ పాండ్య, యశ్ దయాళ్ చెరో వికెట్ తీశారు. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లీ 62, జాకబ్ బెతెల్ 55, రొమారియో షెఫర్డ్ 53* రాణించారు. దేవ్‌దత్ పడిక్కల్ 17, రజత్ పటీదార్ 11, జితేశ్ శర్మ 7, టిమ్ డేవిడ్ 2 విఫలమయ్యారు. ఆఖర్లో రొమారియో షెఫర్డ్ వీరవిహారం చేశాడు. మైదానం నలుమూలలా సిక్స్‌లు, ఫోర్ల వర్షం కురిపించాడు. కేవలం 14 బంతుల్లోనే 53* పరుగులు చేశాడు. ఐపీఎల్‌లోనే ఇది రెండో వేగవంతమైన అర్ధశతకం కావడం విశేషం. చెన్నై బౌలర్లలో మతీష పతిరన 3, సామ్ కరన్ 1, నూర్ అహ్మద్ 1 వికెట్ తీసుకున్నారు కొన్నేళ్లుగా ఐపీఎల్ లో తడబడుతూ సాగుతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు .. ఈ సీజన్లో నిలకడగా ఆడి పాయింట్ల పట్టికలో పైపైన సాగుతుండడం అభిమానులకు అమితానందాన్నిస్తోంది. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించి వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తూ మిగతా జట్లన్నింటికంటే ముందుగా ప్లేఆఫ్స్ బెర్తును దాదాపు ఖాయం చేసుకుంది. ఇప్పటి వరకు 11 మ్యాచ్‌లాడి 8 విజయాలు సాధించిన ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది.



# ఆ జట్టు 18 ఏళ్ల నిరీక్షణకు తెరపడొచ్చు: సునీల్ గావస్కర్

విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దూసుకుపోతోంది. అన్ని విభాగాల్లో రాణిస్తోన్న ఆర్సీబీ ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోనేందుకు ఒక్క విజయం చాలు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. వరుసగా విజయాలు సాధించి ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత మెరుగుపర్చుకున్న ఆర్సీబీ 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించే అవకాశం ఉందని వ్యాఖ్యానించాడు. దానికి కారణం సమష్టిగా అన్ని విభాగాల్లో రాణించడం వల్ల ఇది సాధ్యమవుతోందని తెలిపాడు. ఇవాళ చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో బెంగళూరు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్తు ఖాయమవుతుంది.

''రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుతంగా ఆడుతోంది. బ్యాటింగ్‌లో సూపర్. ఫీల్డింగ్‌లోనూ మెరుస్తోంది. ఈ జట్టుకు ముంబయి ఇండియన్స్ నుంచి తీవ్ర పోటీ తప్పదు. చాలా దూకుడుగా ఆడుతోన్న జట్టు. అయితే, ఇదే విజయపరంపరను ముంబయి కొనసాగిస్తుందా? లేదా? అనేది ప్రశ్న. రాబోయే మూడు మ్యాచులు ముంబయికి చాలా క్లిష్టమైనవి. ఎలా ముందుకుసాగుతుందో చూడాలి. మరోవైపు ఆర్సీబీ మాత్రం టైటిల్ ఫేవరెట్ అని గట్టిగా చెప్పగలను'' అని గావస్కర్ వెల్లడించాడు.

**ఆర్సీబీ చేసిందదే: ఇయాన్ మోర్గాన్**
''ఆర్సీబీ చాలా విషయాల్లో కరెక్ట్ నిర్ణయాలను తీసుకుంది. అందులో ఫిల్ సాల్ట్‌ను ఎంపిక చేసుకోవడం ఒకటి. దీంతో విరాట్‌తో కలిసి టాప్ ఆర్డర్ బాధ్యతను అతడు అందుకొన్నాడు. దూకుడుగా ఆడటంతో మిడిలార్డర్‌పై పెద్దగా ఒత్తిడి లేకుండాపోయింది. ఇక ఆర్సీబీ బౌలింగ్‌ను చూస్తే చాలా బాగుంది. వరల్డ్ అత్యుత్తమ టెస్ట్ బౌలర్ అయిన జోష్ హేజిల్‌వుడ్ తనను టీ20 ఫార్మాట్‌కు మార్చుకొన్న తీరు అద్భుతం. ఒకవేళ మీరు ఆర్సీబీ ఫ్యాన్ అయితే ఈ విషయంలో సంతోషపడాలి. దూకుడైన ఆటతీరుతో ప్లేఆఫ్‌స్‌కు దూసుకుపోయేందుకు బెంగళూరు సిద్ధమైంది'' అని మోర్గాన్ వెల్లడించాడు.





# పహల్గాం ఎఫెక్ట్.. ఆసియా కప్ కష్టమేనా?

పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను కూడా తెంచుకోవాలని ఇప్పటికే పలువురు భారత మాజీ క్రికెటర్లు సూచించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బీసీసీఐ కూడా ఇదే బాటలోకి వెళ్లేలా ఉంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైంది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్థాన్ కీలక పాత్ర పోషించిందనే విమర్శలు వచ్చాయి. క్రీడా సంబంధాలపైనా ఆ ఎఫెక్ట్ పడనుందని.. క్రికెట్ సహా ఇతర క్రీడల్లో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. క్రికెట్‌లోనూ ఇరు జట్ల మధ్య సిరీస్‌లు జరగడం లేదు. ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. ఈ విషయంలో ఐసీసీ కూడా దృష్టిపెట్టాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. దీంతో ఆసియా కప్ 2025లోనూ భారత్ పాల్గొనడంపై ఇప్పుడు అనుమానాలు వెల్లువెత్తాయి. టోర్నీని వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ''ఆసియా కప్ సాధారణంగా తటస్థ వేదిక పైనే నిర్వహిస్తున్నారు. ఈసారి ఇంకా షెడ్యూల్‌ను ప్రకటించలేదు. బంగ్లాదేశ్ సిరీస్ అనంతరం సెప్టెంబర్‌లో వేదికను నిర్ణయించే అవకాశం ఉంది. తాజా సమాచారం ప్రకారం ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం భారత్ పాక్‌ల మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి దశలో నిర్వహించే అవకాశాలు తక్కువే'' అని క్రికెట్ వర్గాలు తెలిపాయి.

**బంగ్లా పర్యటన కూడా రద్దు!**
ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ అక్కడికి వెళ్లాల్సిఉంది. అయితే, బంగ్లా పర్యటనకూ టీమ్ఇండియా వెళ్లే అవకాశం తక్కువేనని సమాచారం. ''ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు చోటుంది. కానీ, దానిని కొనసాగించే ఛాన్స్‌లు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై బంగ్లా నేత చేసిన వ్యాఖ్యలే దీనికి కారణమని తెలుస్తోంది'' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.